క్లుప్తంగా

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ



ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ అప్పలరత్నం

మహారాణిపేట : పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ వరం అని 30వ వార్డు కార్పొరేటర్ కొడూరు అప్పలరత్నం అన్నారు. మంగళవారం సాలిపేట సచివాలయంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిధిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ. 25 లక్షలకు పెంచారని అన్నారు. అనేక రోగాలను ఆరోగ్యశ్రీలో చేర్చి పేద ప్రజలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత సేవలు అందిస్తున్నారని అన్నారు. అలాగే రోగి చికిత్స అనంతరం ఆసరా పేరిట డబ్బు కూడా ఇస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పెంటపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా బోర్‌వెల్



జెండా చెట్టు వీధిలో నిరుపయోగంగా పడి ఉన్న బోర్ వెల్

అల్లిపురం : జెండా చెట్టువీధిలో బోర్‌వెల్ ఒకటి నిరుపయోగంగా పడి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరులోకి మురుగు నీరు వచ్చి చేరటంతో నీరు దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. పలుమార్లు జీవీఎంసీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వారు తెలిపారు. మరో నెల రోజుల్లో వేసవి అడుగుపెడుతున్న తరుణంలో మంచినీటికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నందున జీవీఎంసీ అధికారులు స్పందించి బోర్‌వెల్‌కు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

షాపులకు వేలం నేడు

జగదాంబ : జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో మార్కెట్లు, దుకాణ సముదాయాలకు బుధవారం వేలం పాట నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్ణా మార్కెట్, రామకృష్ణా రైతుబజార్, రెల్లివీధి మార్కెట్, వాణిజ్య సముదాయం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపం, సూర్యాబాగ్ వాణిజ్య సముదాయంలో మొదటి అంతస్థు, 31వ వార్డులోని జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఎదురుగా ఉన్న 9వ నంబర్ షాపు, లక్ష్మీ టాకీస్ వద్ద పద్మానగర్ వాణిజ్య సముదాయంలోని దుకాణాలు, 35వ వార్డు ఫ్రూట్‌మార్కెట్ వద్ద ఉన్న దుకాణ సముదాయంలోని 1 నుంచి 15 షాపులకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్రీడల లోగో ఆవిష్కరణ



క్రీడల లోగోను ఆవిష్కరిస్తున్న డాక్టర్ అశోక్‌కుమార్

మహారాణిపేట : వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో త్వరలో జరగనున్న మెగా స్పోర్ట్స్ కార్నివాల్‌కు సంబంధించిన లోగోను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలను స్ఫూర్తిగా తీసుకుని ఆంధ్రా మెడికల్ కాలేజీ, అనుబంధ ఆస్పత్రుల ఉద్యోగులు, సిబ్బందితో ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 11 నుంచి 15 వరకు క్రికెట్, వాలీబాల్, బ్యాట్మింటన్, టెన్నిస్, అథ్లెటిక్, చెస్, క్యారమ్స్ వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎస్ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మీతులసి, నర్సింగ్ సూపరింటెండెంట్ కల్పనా మౌలి తదితరులు పాల్గొన్నారు.



అద్దంలా మెరిసిపోతున్న స్టేడియం రోడ్డు



జగదాంబ జంక్షన్-పాతపోస్టాఫీస్ రాణిబొమ్మ రోడ్డు

అద్దంలా రోడ్లు

- జోరుగా పాతనగరం విస్తరణ పనులు
- రూ.కోటి 82 లక్షలతో సెవెన్‌హిల్స్ ఆస్పత్రి నుంచి జగదాంబ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ
- రూ.కోటి 71 లక్షలతో వాల్తేర్ అప్‌ల్యాండ్ మేజర్ రోడ్డు పనులు పూర్తి
- 12.50 కోట్లతో జగదాంబ జంక్షన్ నుంచి పాతనగరం రాణిబొమ్మ వరకు విస్తరణ పనులు



అభివృద్ధిలో భాగంగా పాతనగరం కొత్త రూపు సంతరించుకుంటోంది. కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో కొత్త రోడ్లు వేస్తున్నారు. దీంతో పాతనగరంలో నిత్యం ఉండే ట్రాఫిక్ సమస్య తగ్గనుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వాల హయాంలో పాతనగరం అభివృద్ధికి నోచుకోలేదని.. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ ప్రాంతం అభివృద్ధిపథాన సాగిపోతుందని స్థానికులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

డాబాగార్డెన్స్ : అభివృద్ధిలో భాగంగా రోడ్ల విస్తరణ, నూతన రోడ్లు, రోడ్లకు మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయి. పాతనగరంలోని రద్దీ.. ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రోడ్డు విస్తరణ పనులు చకచకా చేస్తున్నారు. వాస్తవానికి ఇప్పటికే పనులు పూర్తి కావల్సి ఉండగా అనివార్య కారణాలు.. రోడ్డు విస్తరణలో వచ్చే అవాంతరాల కారణంగా పనులు కొంత జాప్యమయ్యాయి. జోన్–4 పరిధిలో రూ.12.50 కోట్లతో జగదాంబ జంక్షన్ నుంచి పాతనగరం రాణిబొమ్మ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు జోరుగా సాగుతున్నాయి. విస్తరణలో వచ్చే అవాంతరాలను అధిగమిస్తూ, పలు చోట్ల కోర్టు కేసుల్లో నెలకొన్న వివాదాలు తొలగిస్తూ పనులు పూర్తి చేస్తున్నారు. 80 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం రోడ్డుకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లు వేస్తున్నారు. అలాగే రూ.కోటి 82 లక్షలతో సెవెన్‌హిల్స్ ఆస్పత్రి నుంచి జగదాంబ జంక్షన్ వరకు, రూ.కోటి 71 లక్షలతో వాల్తేర్ అప్‌ల్యాండ్ మేజర్ రోడ్డు పనులు పూర్తయ్యాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2.5 కోట్లతో జీవీఎంసీ ప్రధాన కార్యాలయం నుంచి పోస్టాఫీస్, సౌత్ జైల్ రోడ్డు నుంచి కాన్వెంట్ జంక్షన్ (వయా చావుల మదుం) వరకు చేపట్టిన పనులు పూర్తయ్యాయి. రూ.కోటి 10 లక్షలతో వెలంపేట రోడ్డు, మున్సిపల్ స్టేడియం జంక్షన్ నుంచి దుర్గాలమ్మ జంక్షన్ వరకు, కోటవీధి జంక్షన్ నుంచి సెయింట్ అలోసిస్ స్కూల్ వరకు చేపట్టిన పనులు పూర్తయ్యాయి. రూ.39.90 లక్షలతో కాన్వెంట్ జంక్షన్ నుంచి జ్ఞానాపురం శివాలయం వరకు బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయి.

ఇప్పుడు రోడ్లు బాగున్నాయి..



గత ప్రభుత్వంలో ఉన్న రోడ్ల కన్నా ప్రస్తుతం రోడ్లు బాగున్నాయి. ప్రధానంగా రోడ్లు బాగుంటేనే వాహనాలకు మైలేజీ ఉంటుంది. రాకపోకలు బాగుంటాయి. గతుకుల రోడ్లతో ఇబ్బందులు. ప్రస్తుతం ఎక్కడ చూసినా రోడ్ల పరిస్థితి బాగుంది. ప్రైవేట్ కేబుల్స్ వారు రోడ్లు తవ్వకుండా చర్యలు తీసుకుంటే మంచిది. జగదాంబ జంక్షన్ నుంచి పాతనగరం రాణిబొమ్మ వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే పాత నగరంలో స్థానికులు, వ్యాపారులకు ఎంతో మేలు చేకూరుతుంది. రాకపోకలు సులువవుతాయి.

– పసగాడ రామలింగేశ్వరరావు, ద్విచక్ర వాహనచోదకుడు, పాతనగరం.

నేడు 'ఆసరా' సంబరాలు

డాబాగార్డెన్స్ : నియోజకవర్గంలో బుధవారం 4వ విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించనున్నారు. టర్నర్ చౌల్ట్రీ వేదికగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరగనుంది. ఇప్పటి వరకు 2678 గ్రూపులకు గాను 26906 మంది సభ్యులకు రూ.65 కోట్ల 59 లక్షల 39 వేలు అందజేశారు. నియోజకవర్గ పరిధిలో తొలివిడతలో 2337 మహిళా సంఘాలకు గాను 23534 మంది అక్క చెల్లెమ్మలకు రూ.16 కోట్ల 11 వేల 500 లబ్ధి చేకూరింది. రెండో విడతలో 2668 మహిళా సంఘాలకు, 26841 మంది అక్క చెల్లెమ్మలకు రూ.16.23 కోట్లు లబ్ధి చేకూరింది. మూడవ విడతలో 2674 మహిళా సంఘాలకు గాను 26866 మందికి రూ.16.33 కోట్లు లబ్ధి చేకూరగా.. నాల్గో విడతలో 2678 మహిళా సంఘాలకు గాను 26906 మందికి రూ.16.93 కోట్లు అందజేయనున్నారు. ఇక వార్డుల వారీగా చూసుకుంటే.. 27వ వార్డు నుంచి 162 సంఘాలకు గాను 1605 మంది అక్కచెల్లెమ్మలకు రూ.54 లక్షలు, 29వ వార్డు నుంచి 201 సంఘాలకు గాను 2014 మందికి రూ.1.49 కోట్లు, 30వ వార్డుకి సంబంధించి 192 గ్రూపులు..1924 మంది సభ్యులకు రూ.1.28 కోట్లు, 31వ వార్డు నుంచి 168 గ్రూపులు..1684 మంది సభ్యులకు రూ.1.21 కోట్లు, 32వ వార్డుకి సంబంధించి 176 గ్రూపులు.. 1768 సభ్యులకు రూ.1.33 కోట్లు, 33వ వార్డు నుంచి 171 గ్రూపులు.. 1754 మంది సభ్యులకు రూ.1.22 కోట్లు, 34వ వార్డు నుంచి 198 గ్రూపులు.. 2010 మంది సభ్యులకు రూ.1.82 కోట్లు, 35వ వార్డు నుంచి 292 గ్రూపులు ఉండగా 2965 మందికి రూ.1.42 కోట్లు అందజేయనున్నారు. అలాగే 36వ వార్డుకి సంబంధించి 214 గ్రూపులు.. 2145 మంది సభ్యులకు రూ.1.51 కోట్లు, 37వ వార్డు నుంచి 298 గ్రూపులుండగా 2987 మంది సభ్యులకు రూ.1.58 కోట్లు, 38వ వార్డు నుంచి 287 గ్రూపుల్లో 2874 మంది సభ్యులకు రూ.1.98 కోట్లు, 39వ వార్డుకి సంబంధించి 171 స్వయం సహాయక గ్రూపులకు గాను 1691 మంది సభ్యులకు రూ.1.26 కోట్లు, 41వ వార్డుకి సంబంధించి 148 గ్రూపులుండగా 1485 మంది అక్క చెల్లెమ్మలకు రూ.29 లక్షలు అందజేయనున్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిబ్రవరి ఒకటిన సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఫిబ్రవరి 1న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

నూతన కార్యవర్గం ఏర్పాటు

డాబాగార్డెన్స్ : జననాయక్ కర్పూరి ఠాగూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడంపై ఉత్తరాంధ్ర బీసీ చైతన్య వేదిక హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు మంగళవారం జగదాంబ జంక్షన్ సమీపాన గల ఉత్తరాంధ్ర బీసీ చైతన్య వేదిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పలువురు ప్రముఖులు, బీసీలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర బీసీ చైతన్య వేదిక అధ్యక్షుడిగా పెదపెంకి శివప్రసాదరావు, వేదిక శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడిగా దాసరి జ్ఞానమూర్తి, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడిగా ఎస్వీవీ రామచంద్రరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఓబీసీ నాయకుడు ఉండవల్లి శ్రీనివాసరావు, ఫ్రైడ్ విశాఖ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్లపూడి ఈశ్వరరావు, కణితి ఈశ్వరరావు, నాయీబ్రాహ్మణ సంఘ నగర కమిటీ అధ్యక్షుడు అతవ సుబ్బారావు, బత్రాజుల సంఘం మహిళా అధ్యక్షురాలు అనసూయ, తెలుకల సంఘం నాయకుడు వైవీ రమణమూర్తి, అనకాపల్లి జిల్లా గవర సంఘం నాయకుడు రామచంద్రరావు, గాజువాక బీసీ సవరాల సంఘం ప్రతినిధి రమేష్, సాయికుమార్, గౌడ సామాజిక ప్రతినిధి సాయిరమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్తరాంధ్ర బీసీ చైతన్య వేదిక నూతన కార్యవర్గ సభ్యులు

వెంకన్న ఆశీస్సులు అందరిపై ఉండాలి



తిరుమలలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న మేయర్ దంపతులు

డాబాగార్డెన్స్ : కలియుగ దైవం, తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి ఆశీస్సులు విశాఖ నగర ప్రజలపై ఉండాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అభిలషించారు. మేయర్ దంపతులు తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామిని మంగళవారం దర్శించుకున్నారు. అనంతరం అక్కడి అన్న ప్రసాదం స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికాభివృద్ధి సాధించాలని, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, పేదల పెన్నిధి జగనన్న నాయకత్వంలో 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పీఠం అందుకోవాలని ఆ శ్రీనివాసుడిని వేడుకున్నట్టు చెప్పారు.

మున్సిపల్ స్టేడియం నుంచి మట్టి తరలింపు



మున్సిపల్ స్టేడియంలో మట్టి తరలిస్తున్న వాహనాలు

సాక్షి ఎఫెక్ట్..

జగదాంబ : ఇందిర ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం నుంచి మట్టి తరలిస్తున్నారు. వన్‌టౌన్ రహదారి విస్తరణలో బయటపడిన వ్యర్థాలను మున్సిపల్ స్టేడియంలో డంప్ చేయడంపై సాక్షిలో మట్టితో నిండిపోయిన మున్సిపల్ స్టేడియం శీర్షికన కథనం వెలువడిన నేపథ్యంలో అధికారులు స్పందించారు. జీవీఎంసీ జోన్–4 ఇంజినీరింగ్ అధికారులు వాహనాల ద్వారా మట్టి తరలింపునకు చర్యలు తీసుకున్నారు.

స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాలి

మహారాణిపేట : వైద్య ఆరోగ్య శాఖలోని పలు విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను క్రమబద్ధీకరించాలని ఏపీ నర్సు స్ట్రగుల్ కమిటీకి చెందిన నాయకురాళ్లు దయామణి, వేదవతి కోరారు. మంగళవారం జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సమావేశ మందిరంలో కమిటీ సర్వ సభ్య సమావేశం జరిగింది. నాయకురాలు దయామణి మాట్లాడుతూ వైద్య విద్య, విధాన పరిషత్, పబ్లిక్ హెల్త్, నేషనల్ హెల్త్ మిషన్‌లో దాదాపు 11,500 మంది నర్సులు కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్నారని అన్నారు. తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని సీఎం జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. క్రమబద్ధీకరించే వరకు వంద శాతం గ్రాస్ శాలరీతో పాటు ఇతర సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు ఆర్.రాంబాబు, వై.వరలక్ష్మి, బి.స్వాతి కుమారి, సీహెచ్ సతీష్, జి.కోటేశ్వరరావు, సూర్యకళ, మూర్తి, చిన్నారి, పి.జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిటీ నాయకురాలు దయామణి

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన



లక్ష్మీ టాకీస్ ప్రజాదర్బార్‌లో స్టాఫ్‌నర్స్‌ల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తిలోని పరదేశమ్మ గుడి వద్ద మంగళవారం 27, 41, 42 వార్డులకు సబంధించి ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ నిర్వహించిన ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఆర్థిక సాయం, ఆరోగ్య సమస్యలు, సీఎం రిలీఫ్ ఫండ్, కొత్త పెన్షన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల కోసం ప్రజలు ఎమ్మెల్యే వాసుపల్లికి వినతులు సమర్పించారు. ఆయా సమస్యలపై ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలు మళ్లీ వాసుపల్లిని గెలిపించుకుంటామని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, మండల ప్రెసిడెంట్లు, స్టేట్ డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే పేదలకు న్యాయం..

జగదాంబ : జగనన్న ప్రభుత్వం రామరాజ్యాన్ని తలపిస్తుందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. మంగళవారం జీవీఎంసీ 39వ వార్డు లక్ష్మీ టాకీస్ వద్ద ప్రజాదర్బార్ నిర్వహించి మాట్లాడారు. బుధవారం టర్నర్ చౌల్ట్రీ వద్ద ఆసరా కార్యక్రమం చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో ఆఖండ విజయం తథ్యమన్నారు. సిద్ధం సభ కార్యకర్తల్లో ఉత్సాహం నింపిందన్నారు. పార్టీ వీడిన విషయంలో చట్టరీత్యా ఏ చర్యలు తీసుకున్నా సిద్ధమని తెలిపారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న 11,200 మంది స్టాఫ్‌నర్సులు తమను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఎమ్మెల్యే వాసుపల్లికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, వార్డు ప్రెసిడెంట్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు, ఆలయ చైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం..

మహారాణిపేట : మత్స్యకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. మత్స్యకారుల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఫిషింగ్ హార్బర్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. మత్స్యకార అసోసియేషన్ ప్రెసిడెంట్లు, సభ్యులు, కార్పొరేటర్లు, మండల ప్రెసిడెంట్లు, వార్డు ప్రెసిడెంట్లు, క్లస్టర్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

జాతిపితకు ఘన నివాళి

డాబాగార్డెన్స్ : జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని జీవీఎంసీ గాంధీ విగ్రహానికి రాష్ట్ర కాంగ్రెస్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు, శ్రీశయన సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు తోట వాసుదేవరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిపిత, మహాత్మాగాంధీ భారత స్వాతంత్ర్యానికి చేసిన కృషి ఎనలేనిదన్నారు. గాంధీ కన్న కలలు కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జగన్, ఫర్వీన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అందరూ గాంధీ మార్గం అనుసరించాలి..

ప్రతి ఒక్కరూ గాంధీ మార్గాన్ని అనుసరించాలని ప్రేమసమాజం అధ్యక్షుడు బుద్ధా శివాజీ పిలుపునిచ్చారు. గాంధీ 76వ వర్ధంతిని పురస్కరించుకుని ప్రేమసమాజం సమావేశ మందిరంలో కుష్టు నివారణ దినోత్సవం నిర్వహించారు. ముందుగా ప్రేమసమాజం పాఠశాల ఆవరణలో గాంధీ నూతన విగ్రహాన్ని శివాజీ పునఃప్రారంభించారు. ఏవీఎన్ కళాశాల డౌన్‌రోడ్డులో గల ప్రేమ సమాజం కుష్టు శరణాలయంలో ఆశ్రయం పొందుతున్న వారికి నగదు, నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో న్యూరోసర్జన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం వీ విజయశేఖర్, మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ మోపిదేవి విజయగోపాల్, వీకే సురేష్‌కుమార్, ఎస్. గౌరీప్రసాదరావు, కోన జగదీశ్వరరావు, డి. సింహాచలం, కె. నర్సింహమూర్తి, కె. హరి మోహన్‌రావు, ఎంవీవీకే గుప్త, మోహన్‌రావు, ఉప్పల భాస్కరరావు, పి. భీమారావు, ఎస్. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



శాంతి ప్రదర్శన నిర్వహిస్తున్న ప్రేమసమాజం విద్యార్థులు, ప్రతినిధులు

మానవ హక్కుల కౌన్సిల్ కార్యాలయంలో..

మానవ హక్కుల కౌన్సిల్ కార్యాలయంలో నిర్వహించిన గాంధీ వర్ధంతి కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం తన జీవితాన్ని దారపోసిన మహనీయుడు గాంధీ అన్నారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు రామకృష్ణ, సత్యనారాయణ, సుధీర్, నక్కాన అప్పారావు, సీతామహాలక్ష్మి, సిబ్బంది లాలం నారీమణి, రాజాన నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం చెంత ఇస్కాఫ్ ప్రతినిధులు

మతోన్మాదం నశించాలి..

సీతమ్మధార : మతోన్మాదం మంచిది కాదని విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా జీవీఎంసీ ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ హిట్లర్ మతోన్మాదం దాదాపు ఐదు కోట్ల మంది ప్రజలను బలి తీసుకుందన్నారు. మాజీ వీసీ ప్రొఫెసర్ బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ జాతిపిత గాంధీ సిద్ధాంతాలను ప్రపంచవ్యాప్తంగా అమలు చేస్తుండగా మన దేశంలో హింస, మతోన్మాదం పెరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాఫ్ ప్రతినిధులు సుకుమారన్, సన్ మూర్తి, ఉప్పల అప్పలరాజు, శ్యాం సుందర్, పాలూరి శేషమాంబ, సత్యవతి, కృష్ణకుమారి, జ్ఞానానందం తదితరులు పాల్గొన్నారు.

గాయని సాహితికి వేటూరి పురస్కారం

డాబాగార్డెన్స్ : వర్ధమాన సినీ నేపథ్య గాయని సాహితికి వేటూరి యువ గాయని పురస్కారం ప్రదానం చేయడం అభినందనీయమని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. సినీ గేయ రచయిత వేటూరి 98వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆత్రేయ స్మారక కళా పీఠం 'ఎదలో మోహన లాహిరి' శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ వేటూరి పేరిట పురస్కారానికి సాహితీ ఎంపిక కావడం హర్షనీయమన్నారు. అనంతరం శంబర జోగారావు సారథ్యంలో నిర్వహించిన సంగీత విభావరిలో సాహితీ, రమేష్ పట్నాయక్ ఆలపించిన వేటూరి గీతాలు అలరించాయి. గంటి మురళి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విజయనగరం కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అవనాపు విజయ్, పైడా కృష్ణప్రసాద్, ఉసిరికాయల చంద్రశేఖర్, సుహాసిని ఆనంద్, దాడి సత్యనారాయణ, కళా సంస్థల అధినేతలు చెన్నా తిరుమలరావు, ఎన్ఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.



సాహితికి పురస్కారం అందజేస్తున్న అతిథులు

రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ ఔదార్యం

మహారాణిపేట : హరే కృష్ణ మూవ్‌మెంట్, టచ్ స్టోన్ చారిటీస్ ఆధ్వర్యంలో సుభోజనం పేరిట నేటికి 35 లక్షల మంది రోగుల సహాయకులకు భోజనాలు అందించారు. కేజీహెచ్‌లో సుభోజనం పేరిట 2011 నవంబర్ 21వ తేదీ నుంచి పది రూపాయలకు, దాతలు ఎవరైనా ముందుకు వస్తే ఉచితంగా భోజనాలు పెడుతున్న సంగతి తెలిసిందే. ఇలా ఇప్పటికి 35 లక్షల మందికి భోజనాలు పెట్టారు. ఈ కార్యక్రమం గురించి తెలుసుకున్న రాజ్యసభ సభ్యులు జీవీఎల్ నరసింహారావు మంగళవారం తన సొంత నిధులతో 500 మందికి భోజనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, శ్రీ గాయిత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ ప్రతినిధి రూపాకుల రవికుమార్, హరే కృష్ణ మూవ్‌మెంటు అధ్యక్షుడు డాక్టర్ ఎస్.భక్త దాస, సభ్యులు యదురాజా దాస, శృతిసాగర దాస, పి. షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుభోజనం నిర్వాహకులను జీవీఎల్ అభినందించారు.



కేజీహెచ్‌లో భోజనాలు పంపిణీ చేస్తున్న జీవీఎల్ తదితరులు

విలువలతో కూడిన సాహిత్యం దాశరథి సొంతం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'దాశరథి సినీ సాహిత్యం–జనరంజక వీణానాదం' అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించారు. ముఖ్యఅతిథి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ సినిమా సాహిత్యం ఒకవైపు ఆనందాన్ని అందిస్తూనే సమాజ విలువలను తెలియజేస్తుందన్నారు. ప్రత్యేక అతిథి మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు విభాగాధిపతి ఆచార్య వి.శంకరరావు మాట్లాడుతూ సాహిత్యంలో అద్భుతమైన పాటలు రాసి సాహిత్యపు విలువలు పెంపొందించిన సినీ గేయ రచయత దాశరథి అని కొనియాడారు. ఆచార్య వెలమల సిమ్మన్న రచించిన 90వ పుస్తకం రావిశాస్త్రి రచనలు–అభ్యుదయ దృక్పథం పుస్తకాన్ని ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య జర్ర అప్పారావుకు అంకితం చేసినట్లు ఆచార్య సిమ్మన్న తెలిపారు.